

టిటిడిలో నేరచరితులపై విచారణ వాయిదా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టాలకు వ్యతిరేకంగా శరత్ చంద్రారెడ్డి, డాక్టర్ కేతన్, సామినేని ఉదయభాను వంటి నేర చరిత్ర వున్న వ్యక్తులు టీటీడీ బోర్డులో స్థానం పొందడం నిబంధనలకు విరుద్ధమని విజయవాడకు చెందిన చింతా వెంకటేశ్వర్లు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా వున్న శరత్ చంద్రారెడ్డి, సామినేని ఉదయభాను, డాక్టర్ కేతన్‌లపై తీవ్ర నేరాభియోగాలు వున్నాయని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. పవిత్రమైన తిరుమలలో ఇలాంటి వారు వుండటం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఆకుల శేషసాయి, జస్టిస్ రఘునందన్ రావుల ధర్మాసనం .. దేవాదాయ శాఖ కమీషనర్, టీటీడీ ఈవోలకు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

'నో' అంటే 'నో'

- ఆర్‌బికెల్లో 'నానో' బలవంతపు అమ్మకాలు
- రెండేళ్లలో అమ్ముడుపోయింది 2వేల బాటిళ్లే
- సాంప్రదాయ యూరియా వైపే రైతుల మొగ్గు
- సబ్సిడీనుంచి కేంద్రం తప్పకునేందుకేనా..?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నానో ఎరువులు మార్కెట్లోకి వచ్చేశాయి.. అయితే రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే వాడిన రైతులు పంట దిగుబడిలో ఎటువంటి మార్పు లేదని చెబుతున్నారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం ప్రాథమిక సహకార సంఘానికి సుమారు 500 బాటిళ్ల నానో యూరియాను సరఫరా చేస్తే 2022 రబీ నుంచి ఇప్పటి వరకు అమ్ముడు పోయింది కేవలం 8 బాటిళ్లే అంటే నమ్మి తీరాలి మరి. అంతేకాదు జిల్లావ్యాప్తంగా 2వేల బాటిళ్లే రెండేళ్లలో అమ్ముడు పోయాయి.. అయినా ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా బలవంతంగా రైతులకు అంటగడుతూ, శాస్త్రవేత్తల ద్వారా ప్రచారం చేయించడమూ విమర్శలకు తావిస్తోంది.. కేంద్ర ప్రభుత్వం యూరియాపై ఇచ్చే సబ్సిడీనుంచి తప్పకునేందుకు 'నానో' ఎరువులను తెరపైకి వచ్చిందని విపక్షలు మండిపడుతున్నాయి. సాధారణంగా 50 కిలోల యూరియా బస్తా తయారీకి కేంద్రానికి రూ.3 వేలకు పైనే ఖర్చు అవుతుంది. అందులో రూ.3 వేలు రాయితీ కింద కేంద్రం భరించి కేవలం రూ.250కే యూరియాను రైతులకు అందజేస్తోంది. ఇది మోదీ ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. ఈ ఖర్చునుంచి తప్పుకునేందుకు ఇఫ్కో లాంటి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా నానో ఎరువులను క్రమంగా రైతులకు అలవాటు చేసే ప్రయత్నంలో ఉందని సమాచారం. నానో యూరియా ప్రాజెక్టు పెద్ద మోసమని అంతర్జాతీయ, జాతీయ పరిశోధనా సంస్థలు కోడై కూస్తున్నా, కోపెన్ హాగెన్ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు నానో యూరియా ఫలితాలు సందేహాలు వ్యక్తపరుస్తున్నా మోదీ ప్రభుత్వం ముందుకే వెళ్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- **నానోపై రైతుల అనాసక్తి**

ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధిక శాతం రైతులు వరినే సాగు చేస్తారు. సుమారు 5 లక్షల మంది రైతులు వరిని పండిస్తున్నారు. వరి సాగులో అతికీలకమైన ఎరువు యూరియా. నారు నుంచి పైరు ఏపుగా పెరిగే దాకా యూరియా వాడకం తప్పనిసరి. ఈ క్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రైతులకు యూరియా కొరత నిరంతర సమస్యగా మారుతోంది. కేంద్రం సబ్సిడీపై ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా యూరియాను సరఫరా చేస్తున్నా డిమాండ్ మేరకు సరఫరా జరగకపోవడంతో కొరత ఉత్పన్నమవుతోంది. కాగా ఆర్బీకేలు, పీఏసీఎస్‌లకు సరఫరా చేస్తున్న యూరియా పక్కదారి పడుతుండటంతో కొరత మరింత తీవ్రతరమవుతోంది. మరో పక్క ప్రైవేటు ఫెర్టిలైజర్ దుకాణాల్లో యూరియా కావాలంటే తాము ప్రతిపాదించే పరుగుమందులు కొనాలన్న ఆంక్షలు పెడుతుండటంతో కృత్రిమ యూరియా కొరతగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ఇదే అదునుగా ఇఫ్కో గుర్తింపుపై 2022 రబీ నుంచి నానో యూరియాను కేంద్రం మార్కెట్లోకి తెచ్చింది. అయితే నానో ఎరువుపై రైతుల్లో అవగాహన లేకపోవడం, శాస్త్రీయంగా నిరూపణ కాకపోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో అధికారులు డెమో ఇవ్వకపోవడంతో నానో ఎరువులపై రైతులు అనాసక్తిని చూపుతున్నారు.

- **అమ్ముడుపోయింది 2 వేలే..!!**

సహకార రంగం ఇఫ్కో గుర్తింపుతో నానో యూరియా మార్కెట్లోకి వచ్చింది. బస్తా యూరియాకు సమానంగా 500 మిల్లీలీటర్ల బాటిల్ సరిపోతుందని వెల్లడించింది. ఇది ఎకరా పొలానికి సరిపోతుందని చెప్పింది. మార్కెట్లో 50 కిలోల యూరియా బస్తా రూ.260 కాగా, 500 మి.లీ నానో బాటిల్ కేవలం రూ.240కే వస్తోంది. ఇదిలా ఉంటే 2022 నుంచి నానో యూరియా బాటిళ్లు మార్కెట్లో ఉన్నా కొనే నాథుడు కరువయ్యారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2 వేల బాటిళ్లు కూడా అమ్ముడుపోలేదంటే అతిశయోక్తి కాదు.

ప్రభావం అంతంతమాత్రమే: రంగయ్య, రైతు, సాంబయ్యపాళెం

పంటలపై నానో ప్రభావం అంతంతమాత్రంగానే పనిచేసింది. గతేడాది యూరియా దొరక్క అల్లాడిపోయాం. ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు పెట్టి అమ్మారు. ఆ పరిస్థితుల్లో వ్యవసాయాధికారుల సూచన మేరకు నానో యూరియాను స్ప్రే చేశాం. సాంప్రదాయ యూరియా కన్నా మంచి ఫలితమేమీ రాలేదు. రైతుల్లో నానో పట్ల పెద్ద ఆసక్తి లేదు.

అవగాహన పెంచుతాం: రమేష్, ఏడీఏ, శ్రీకాళహస్తి

నానో వాడకంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలున్నమాట వాస్తవమే. తక్కువ కొనుగోళ్లూ జరిగిన మాట నిజమే. నానో యూరియా వాడకంపై రైతుల్లో సంపూర్ణ అవగాహన లేదు. నానా యూరియా వాడకంపై వ్యవసాయ క్షేత్రాల్లో అవగాహనా సదస్సులూ నిర్వహించలేదు. ఫలితంగారైతుల్లో దానిపై అనాసక్తి ఏర్పడింది. సాధారణంగా సాంప్రదాయ యూరియాతో పోల్చితే నానో కూడా మంచి ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేరు వ్యవస్థపై అది పనిచేయదు కాబట్టి నెల రోజులు పైబడ్డ పైరుపై పిచికారీ చేస్తే సమర్ధవంతంగా పనిచేస్తుంది.

కీర్తి 'శిఖరం'

బ్రెయిన్‌డెడ్‌తో ఏడుగురికి ప్రాణదానం

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

'కీర్తి' మరణించింది.. అయినా ఏడుగురిని బతికించింది.. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన కీర్తి (20) త్యాగం చిరస్మరణీయమని అందరూ కొనియాడుతున్నారు. మరణించిన తరువాతా జీవించాలనుకునేవారికి అవయవదానాన్ని మించింది మరొకటి లేదని సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం అన్నారు. కీర్తి మృతదేహం వద్ద బుధవారం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కీర్తి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం రామాపురం దళితవాడకు చెందిన సంపత్‌కుమార్, అమ్ములు దంపతుల కుమార్తె కీర్తి (20). ఓ ప్రైవేట్ కళాశాలలో బికాం చదివింది. చెన్నయ్‌లోని ఓ ప్రైవేట్ కాల్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఆమె స్నేహితునితో కలిసి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై జిల్లా సరిహద్దులోని కరడి పుత్తూరులో స్నేహితుని పెళ్లికి బయల్దేరింది. కరడి పుత్తూరు వంతెన వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయింది. స్నేహితుడు రాబర్ట్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కీర్తి బ్రెయిన్‌డెడ్ అయ్యింది. అవయవదానం చేయాలని చెన్నయ్ జిహెచ్ ఆస్పత్రి డీన్ కీర్తి తల్లిదండ్రులను అభ్యర్థించారు. తల్లిదండ్రులు అంగీకరించడంతో కీర్తికి నివాళులు అర్పిస్తూ చెన్నయ్‌లోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో 'వాక్ ఆఫ్ హానర్8 నిర్వహించారు.

కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం

కీర్తి కుటుంబ సభ్యులకు రెవిన్యూ శాఖ తరపున తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో శ్రీనివాసులు రూ.10 వేలు నగదును అందించి తమ దాతత్వాన్ని చాటుకున్నారు.

అవయవదానం చెయ్యాలని చెప్పేది : తల్లిదండ్రులు

కీర్తి తల్లిదండ్రులు మాట్లాడుతూ సాధారణంగా ఎవరైనా చనిపోతే శరీర భాగాలనుదానం చేయాలని ఎపుడూ చెబుతూ ఉండేది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. మాది వ్యవసాయ కుటుంబం. నలుగురు పిల్లలు. ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. మొదటి కుమార్తె కీర్తి. మా కుటుంబానికి కీర్తి మరణంతో వెనుమొక పోయినట్లయ్యింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి. అవయవదానం చేస్తే కీర్తి అభిప్రాయాలను గౌరవించినట్లవుతుందని చేశాం. సంతోషంగా ఉంది.

ఏడుగురి ప్రాణాలను కాపాడుతోంది : తెరని రాజన్, ప్రిన్సిపాల్, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి

బ్రెయిన్ డెడ్ అయిన మహిళ కీర్తి శరీరం ఈరోజు ఏడుగురి ప్రాణాలను కాపాడుతోంది. ప్రపంచంలో వందమందిలో 47 మంది అవయవాలను దానం చేసే ఏకైక దేశం స్పెయిన్. ప్రపంచంలో చివరిరాష్ట్రం భారతదేశం. రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో రెండోసారి ఈ హానర్‌వాక్ నిర్వహిస్తున్నాం. దీనిద్వారా యువతలో అవయవదానంపై అవగాహన కల్పించేందుకు ఈ హానర్‌వాక్ నిర్వహిస్తున్నాం. 18 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత ఎవరైనా అవయవ దానం చేయొచ్చు.

కీర్తి మృతదేహం వద్ద నివాళి

పండ్ల పరిశ్రమను ఆధునీకరిస్తే మేలు

చిత్తూరుఅర్బన్ : జిల్లా వ్యాప్తంగా పలు ఆహార వస్తువులు తయారు చేసే పరిశ్రమలు వాటిని ఆధునికరించుకోవడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవడానికి వీలు అవుతుందని జిల్లాపండ్ల సమాఖ్య గౌరవాధ్యక్షులు కట్టమంచి బాలకష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కట్టమంచి బాలకష్ణారెడ్డి భవన్లో గుజ్జు పరిశ్రమలకు సంబంధించి ఆధునికరణ పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలకష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఆహార సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం పెరుగుతోందని, ఈ పరిశ్రమలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని. ఈ ఆధునిక సాంకేతికత ద్వారా ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు వధా కూడా తగ్గుతుందన్నారు. ప్రధానంగా మామిడి, జామ, బొప్పాయి, టమోటా వంటి ఆహార సంబంధిత ఫ్యాక్టరీలలో

ఇది ఎంతైనా అవసరం అని అన్నారు. ఈ సమావేశంలో ఆల్ఫా లవల్ కంపెనీకి సంబంధించిన వైస్ ప్రెసిడెంట్ పంకజ్ మహేశ్వరి, పరమేశ్వర్ , మధుసూదన్ జైన్ ఆధునిక సాంకేతికతను గురించి వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశ్రమల యజమానులకు వారి ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పండ్ల పరిశ్రమనుంచి శివకుమార్, గోవర్ధన్ బాబి, తలుపులపల్లి బాబు రెడ్డి, గల్లా సోము తదితరులు పాల్గొన్నారు.

15కల్లా శ్రీనివాస సేతు పూర్తవ్వాలి : టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీనివాస సేతును సెప్టెంబరు 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చే ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం టీటీడీ పరిపాల భవనంలోని తన ఛాంబర్ లో టీటీడీ, మున్సిపల్ అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీనివాస సేతు నిర్మాణ పనులు సెప్టెంబరు 15వ తేదీకి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. 12వ తేదీ నుండి శ్రీనివాస సేతుపై ట్రెయల్ రన్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, మున్సిపల్ కమీషనర్ హరిత పాల్గొన్నారు.

విమర్శలను విజ్ఞతకే వదిలేస్తాం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అలిపిరి నడకమార్గంలో క్రూరమగాల సంచారం నేపథ్యంలో అనేక భద్రతా చర్యలు తీసుకున్నామని, ఇందులో ఒక చర్యగా భక్తుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి చేతికర్రలు అందజేస్తున్నామని టీటీడీ ధరకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అలిపిరి పాదాల మండపం వద్ద ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి ఛైర్మన్ బుధవారం భక్తులకు చేతికర్రలను అందజేశారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ చేతికర్రలతో భక్తులు క్రూరమగాలతో పోరాడతారని కాదని, చేతిలో కర్ర ఉంటే ఏ జంతువైనా వెనకాడుతుందని శాస్త్రీయ పరిశీలన ద్వారా రుజువైందని చెప్పారు.

'ఊతకర్రలు' పంపిణీలో టిటిడి ఛైర్మన్

వేల సంవత్సరాల నుంచి గ్రామాల్లో ప్రజలు పొలాలకు, అడవులకు వెళ్లేటప్పుడు చేతికర్రలను ఆసరాగా తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. కర్రల పంపిణీకి సంబంధించి విమర్శలు చేస్తున్న వారిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. చేతికర్రలను భక్తులకు ఉచితంగా అందిస్తామని, వీటిని అలిపిరిలో అందజేసి శ్రీ నరసింహస్వామివారి ఆలయం వద్ద తిరిగి తీసుకుంటామని తెలిపారు.

టీటీడీ ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి మాట్లాడుతూ చేతికర్రల కోసం అడవిని నాశనం చేయడం లేదని, పది వేల కర్రలు మాత్రమే తీసుకున్నామని, ఇందుకోసం రూ.45 వేలు ఖర్చు అయిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహాకిషోర్, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, టీటీడీ డిఎఫ్‌వో శ్రీనివాస్, తిరుపతి డిఎఫ్‌వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను గుర్తించండి : ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

క్షేత్రస్థాయిలో వివిధ రకాల వ్యాధిగ్రస్తులను వాలంటీర్ ,ఏఎన్ఎంలు గుర్తించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కష్ణమోహన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం సంబంధించి కమిటీలతో పాటు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ నుంచి ప్రత్యేక డాక్టర్లు,

ఆరోగ్యశ్రీ కి సంబంధించిన డాక్టర్లు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు యూరిన్, రక్త పరీక్షలు, ఈసీజీ లాంటి పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన వైద్య సహాయంతో పాటు మందులు ఉచితంగా ఇవ్వనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ప్రభావతి పాల్గొన్నారు.

పెత్తందారుల బెదిరింపులకు భయపడేది లేదు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : ఎట్టేరి గ్రామంలో దళితులు ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్నీ ఎత్తివేయాలని అగ్రవర్ణాకులస్తులు చేస్తున్న దౌర్జన్యం పై దళిత సంఘాల నాయకులు ప్రతిఘటించారు.. బుధవారం చిత్తూర్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలోఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలం ఎట్టేరి గ్రామంలో సర్వే నంబర్ 325 లో ఖాళీస్థలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని గ్రామానికి చెందిన పెత్తందారులు ఇంద్రశేఖర్ రెడ్డి, జనార్దన్ రెడ్డిలు దళిత వర్గాలకు చెందిన అంబేద్కర్ విగ్రహం ఇక్కడ

ఉండరాదని, సాయంత్రం లోపు తొలగించాలని హుకుం జారీ చేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. విగ్రహాన్ని తొలగించని పక్షంలో అంతు చూస్తామని గ్రామస్తులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలని చేసే ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు

15 అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం

చిత్తూరుఅర్బన్: ఈనెల 15వ తేది అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో శంఖారావం దీక్షలుకు పూనుకోనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల దీక్షకు చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. బుధవారం చిత్తూర్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు చలో విజయవాడ కరపత్రాలు విడుదల చేశారు.

వారంలో రెండు రోజులు 'జగనన్నకు చెబుదాం'

చిత్తూరుఅర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో వారానికి రెండు రోజులు అంటే బుధ, శుక్రవారాల్లో నిర్వహించేందుకు సిద్ధం అవుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండీ జీవో 1775ను విడుదలయ్యింది. ఈనెల 8వ తేదీ పూతలపట్టు నియోజకవర్గం ఐరాలలో నిర్వహించనున్నారు.

పవర్ 'లెస్' పాట్లు



- అప్రకటిత 'విద్యుత్ కోతలు
- వర్షాకాలంలోనూ తగ్గిన ఉత్పత్తి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కరెంట్..కరెంట్... ఇప్పుడు ప్రతి పనికి అవసరమైనది. కరెంట్ లేకపోతే పనులు ఎక్కడికక్కడ స్తంభించిపోతాయి. ఆఖరికి తాగేనీరు కూడా కరెంట్ లేకపోతే లభ్యమయ్యే పరిస్థితి లేదు. ఇంతటి ప్రాముఖ్యత విద్యుత్‌కు ఉంది. సమాజంలోని ప్రజలు, సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలు అన్ని దానిపైనే ఆధారపడుతున్నాయి. కానీ ఇటీవల విద్యుత్ కోతలు అధికమయ్యాయి. ఎప్పుడు విద్యుత్ ఉంటుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఉత్పత్తికంటే వినియోగం అధికమైందని సాక్షాత్తు అధికారులే ప్రకటిస్తూ, అనాధికారికంగా కొంత, అధికారికంగా కొన్ని చోట్ల కరెంట్ కోతలు పెడుతుండడం గమనార్హం.

సాధారణంగా వేసవి కాలంలో...తీవ్ర ఎండలు, పెరిగే ఉష్ణోగ్రతల కారణాల చేత కరెంట్ కోతలు పెట్టడం అందరికి తెలుసు. ఓ పక్క ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విస్తరంగా వర్షాలు కురుస్తున్న విద్యుత్ కోతలు వేయడం వినియోగదారులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. వాస్తవానికి విద్యుత్ ఉత్పత్తిలో లోపం వల్ల సరఫరాకు ఇబ్బంది కల్గితే ముందుగానే అధికారులు తెలియజేసి వేసవికాలం వంటి సమయాల్లో నిర్ణీత సమయంలో పలానా ప్రాంతంలో పలానా లైన్లో, ఇన్ని గంటల నుంచి ఇంత టైమ్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు ముందుగానే ప్రకటిస్తారు. ఇక తప్పని సరిపరిస్థితుల్లో వినియోగదారులు అత్యవసర పనులను నిర్దేశిత సమయానికంటే ముందో, తర్వాత చేసుకునేలా ప్రయాణాళికబద్ధంగా ఉండేవారు. కానీ అనధికారికంగా కోతల వల్ల ప్రజల రోజువారి పనులకు అవాంతరాలు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణ ప్రాంతాల్లో కూడా అనాధికారికంగా కోతలు విధించడం గమనార్హం.

వాస్తవానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా (తిరుపతి, చిత్తూరు; అన్నమయ్య జిల్లాలు కలిపి) మొత్తం 19,52,790 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో గృహ సర్వీసులు 13,73, 345, వాణిజ్యం(కమర్షియల్) 1,61,215, పరిశ్రమలు 21,175, ప్రభుత్వ సర్వీసులు 46,690, వ్యవసాయం 3,17,709, వీధి దీపాలు 17000, ఆర్‌డబ్ల్యుఎస్13,924, హెచ్‌టీ -1906 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి వినియోగానికి రోజువారిగా 26 ఎంయు అవసరం కాగా 19 ఎంయు మాత్రమే లభ్యమవుతున్నట్లు సమాచారం. దీంతో డిస్కంలు వివిధ కారణాలు చెప్పి, కొన్ని చోట్ల ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కరెంట్ కోతలను అమలు చేస్తున్నారు. వాస్తవానికి డిస్కం అధికారులు ముందస్తుగా డిమాండుకు తగ్గట్టుగా విద్యుత్‌ను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. వారికి ఉన్న వనరులైన ధర్మల్ విద్యుత్, జల విద్యుత్, గ్యాస్ విద్యుత్, పవన్ విద్యుత్, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా విద్యుత్‌ను డిమాండుకు తగినంత సిద్ధం చేయాలి. వాటి ద్వారా ఉత్పత్తి తగ్గుతుందని గమనించి, ముందస్తుగా ప్రత్యామ్నాయాలు సిద్ధం చేయాలి, అవసరమైతే ప్రయివేట్ సంస్థల నుంచైనా విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారుల అవసరాలకు తగ్గ విధంగా సరఫరా చేయాల్సి ఉంది. కానీ డిస్కంలు పూర్తిస్థాయిలో ఆ విధమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డిస్కంలు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారనే మాట నిజమైతే కోతలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. ఇప్పటికైనా అటు ప్రభుత్వం, ఇటు డిస్కంలు, ట్రాన్స్‌కో వంటి సంస్థలు ప్రత్యామ్నాయల వైపు దృష్టిసారించి, వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసి, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆ దిశగా డిస్కంలు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

అంతరాయం తగ్గుతుంది : కృష్ణారెడ్డి, ఎస్ఇ, ట్రాన్స్‌కో

ఈ నెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి. ప్రస్తుతం జిల్లాకు కేటాయించే కోటా పెరిగింది వీటికి తోడు థర్మల్, పవన్ విద్యుత్ కేంద్రాల సరఫరా పెరుగుతోంది. గత ఏడాది కంటే ప్రస్తుతం 20 శాతం పైగా విద్యుత్ వినియోగం పెరిగింది .వ్యవసాయ, గ్రామీణ సర్వీసులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం.

ప్రాజెక్టు వర్క్‌కు ఇబ్బందిగా ఉంది : మచ్చల గాయత్రి, చంద్రగిరి



వేలాపాళలేని కరెంట్ కోతలు వల్ల ప్రాజెక్టు వర్క్ చేసుకునేందుకు ఇబ్బందిగా ఉంది. ఇంటి వద్దే ఉంటూ వర్క్‌ఫ్రమ్ హోం పద్ధతిలో ప్రాజెక్టు వర్క్ చేసుకుంటున్నాను. ప్రాజెక్టు వర్క్‌లో ఏదైన సమస్య ఓ కొలిక్కి వచ్చే సమయంలో కరెంట్ పోతుండడంతో ఆ సమస్యను మళ్లి మొదటి నుంచి చేయాల్సిన పరిస్థితి వస్తోంది. దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాను. కరెంట్ సరఫరాపై కోతలు వేస్తామని ముందస్తు సమాచారం అన్నా ఉంటే కొంత అప్రమత్తంగా ఉండేవాళ్లం.

అర్ధరాత్రుల్లో చాలా ఇబ్బంది : పి.కృష్ణమ్మ, మల్లంగుంట, తిరుపతి రూరల్

ఈ కరెంటోళ్లకు వేళాపాల లేదు. పగులు, రాత్రి అనే తేడానే లేదు. అర్ధరాత్రి పడుకుని ఉంటే కరెంట్ ఆప్ చేసేస్తా ఉన్నారు. చెమటలు పట్టి లేస్తే గాని కరెంట్ అఫ్ అయిందనే విషయం తెలియదు. కరెంటోళ్ల తీరు ఎప్పుడు మారుతుందో.

ఛార్జీల్లో మోతలు...కరెంట్‌లో కోతలు : ఎం.సుబ్రమణ్యం, డ్రైవర్, ఎ. రంగంపేట

ఓ పక్క కరెంట్ చార్జీలు చడీచప్పుడు కాకుండా.. చాపకింద నీరులా పెంచేస్తున్నారు. మరో పక్క కరెంట్ సరఫరా చేయడంలో మాత్రం కోతలు తప్పడం లేదు. వినియోగదారులు కరెంట్‌కు బిల్లులు కట్టడం లేదా. నిత్యం కరెంట్ సరఫరా చేయాల్సిన అధికారులు, డిస్కంలు ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకోవడం సరైనది కాదు. కాస్త జవాబుదారీతనంగా ఉండాలి.

వర్షాకాలంలో కోతలేందో...? : టి.ప్రకాష్, ఉద్యోగి, గిరిపురం, తిరుపతి



మామూలుగా ఎండకాలంలో కరెంట్ వాడకం ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తి తక్కువగా ఉందని కరెంట్ కోతలు పెట్టడం సహజం. కానీ వర్షాకాలంలో కూడా కరెంట్ కోతలు విధించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వాలు ఉండేది. ప్రజా అవసరాలు తీర్చేందుకు. ఏ సమయంలో ఏది అవసరమో, భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను ముందే గ్రహించి, వాటిని ఎదుర్కునేందుకు అప్రమత్తంగా ఉండేందుకే డిస్కంలు ఉండేది. కానీ ఉత్పత్తి తగ్గింది, వినియోగం పెరిగింది అంటూ కుంటిసాకులు చెప్పేందుకు కాదు.

ఉదయనిధి వ్యాఖ్యలు సమర్థనీయం : కెవిపిఎస్

ప్రజాశక్తి- పలమనేరు: తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఎమ్మెల్యే, మంత్రి ఉదయనిధి సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని చేసిన వ్యాఖ్యలు సమర్థనీయమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన్య కార్యదర్శి అన్నూరి ఈశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సనాతన ధర్మం కులవ్యవస్థను కాపాడటమేకాక అగ్రకుల దురంహంకారానికి అగ్రపీఠం వేస్తుందని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని, మహిళల హక్కులు లేకుండా చేస్తుందని అన్నారు. అటువంటి సనాతన ధర్మాని కూకటివేళ్లతో పెకలించాలని ఉదయనిధి చేసిన వ్యాఖలను స్వాగతిస్తున్నామని అన్నారు.

బేలుపల్లిలో రేణుకారెడ్డి పర్యటన

బైరెడ్డిపల్లి: మండలం బేలుపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎన్.అమరనాథ రెడ్డి సతీమణి రేణుకారెడ్డి పర్యటించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమ, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తూ భవిష్యత్‌కు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ జెడ్‌పిటిసి రాధాకిషోర్ గౌడు, సుబ్రహ్మణ్యం, రమేష్ రెడ్డి, భువనచంద్ర, నాగరాజా, కృష్ణమూర్తి, శంకరప్ప, ఎం.సుబ్రహ్మణ్యం రెడ్డి, రవిచంద్రగుప్తా, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారంటీ..

నగరి: నగరిరూరల్ మండలంలోని వికెఆర్ పురంలో బుధవారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏపీ అభివద్ధి చంద్రబాబుతోనే ముడిపడి ఉందని, సందప సష్టికర్త చంద్రబాబు అన్నారు. సంపదను సష్టించి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువచేసి, సమసమాజత్వాన్ని స్థాపించాలన్నదే టీడీపీ ధ్యేయమన్నారు. మండల టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ శివకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం,మాజీ ఎంపీటీసి హరిబాబు, వెంకటేష్ యాదవ్, గ్రామకమిటీ ప్రెసిడెంట్ భూపతి, టిఎన్‌టియుసి సెక్రటరీ కె.బాలాజీ, చంద్ర, మణిగండన్, బాల సురేష్, పరంధామ నాయుడు పాల్గొన్నారు.

ఐకమత్యంగా పనిచేయండి :ఎమ్మెల్యే

బుచ్చినాయుడు కండ్రిగ: వైఎస్సార్‌సీపీ బలోపేత్తానికి నాయకులు కలసికట్టుగా, ఐకమత్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచారు. బుధవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం నాయకులు, కార్యకర్తలు సైనికులా పనిచేయాలన్నారు. పార్టీలో ఒక్కరి అన్యాయం జరగనవ్వనని హామీ ఇచ్చారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, రాకేష్, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిఎం.హరిహరన్‌కు పిహెచ్‌డి ప్రదానం

పుత్తూరు టౌన్ : పట్టణంలోని శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగఅధిపతి బి.ఎం. హరిహరన్‌కు అన్నామలై యూనివర్సిటీ వాణిజ్య శాస్త్రవిభాగంలో పిహెడి ప్రదానం చేశారు. టిటిడి అందిస్తున్న సేవలు, భక్తుల మనోభావాలు, సంతృప్తి అనే అంశంపై అన్నామలై యూనివర్శిటి అధ్యాపకులు డాక్టర్ టికె.సెంథిల్ కుమార్, ఎస్వీ యూనివర్శిటీ అనుబంధ నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ బి.భాస్కర్ సంయుక్త పర్యవేక్షణలో జరిపిన పరిశోధనలకు గాను పీహెచ్‌డి పొందారు.

ఉమామహేశ్వర్‌కు పిహెచ్‌డి..

పుత్తూరు టౌన్: పట్టణం శ్రీవిద్యా డిగ్రీ కళాశాలల చైర్మన్ గుంటి ఉమామహేశ్వర్ అన్నామలై యూనివర్సిటీ, డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ రీసెర్చ్ భౌతిక శాస్త్ర విభాగంలో పిహెచ్‌డి పొందారు. అన్నామలై యూనివర్సిటీ భౌతికశాస్త్రం ప్రొఫెసర్ వి.రామస్వామి, ఎస్వీ యూనివర్సిటీ భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ దేవ ప్రసాద్ రాజు సంయుక్త పర్యవేక్షణలో నియోడైమియ, యూరోపియ, అయాన్స్ డోపెడ్ ఫ్లోరోబోరేట్ అండ్ నియోడైమియం, యుటర్బియ్యం డోపెడ్ సిలికేట్ గ్లాసెస్ ఫర్ లేజర్ డిస్ప్లే డివైజస్ అప్లికేషన్స్ అనే అంశంపై జరిపిన పరిశోధనలకుగాను ఈ పిహెచ్‌డి ప్రదానం చేయడం జరిగినది.

'కట్టా'కు అరబిందో ఫార్మా డైరెక్టర్ పరామర్శ

నాయుడుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డిని అరబిందో ఫార్మా డైరెక్టర్ మదన్ మోహన్‌రెడ్డి పరామర్శించారు. సుధాకర్ రెడ్డికి ఇటీవల తీవ్రంగా గాయపడి చెన్నైలోని విజయ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని మేనకూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మదన్ మోహన్‌రెడ్డి బుధవారం ఆయన నివాసం వద్దకు చేరుకుని పరామర్శించారు. ఆయన వెంట కట్టా కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ సిహెచ్ సురేష్, షేక్ రఫీ, పసల పరంధామయ్య, నరేంద్ర ఉన్నారు.

కరాటేలో ప్రతిభ..

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీవాణి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటారు. చెన్నయ్‌లోని తంబ్రామ్‌లో జరిగిన ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ శ్రీవాణి విద్యామందిర్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కే.మాధుర్యశ్రీ ప్రథమ బహుమతి, 7వ తరగతి చదువుతున్న కే.చాతుర్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థినులకు పాఠశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా గోవిందప్ప

శాంతిపురం: చిత్తూరు జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆర్ఎన్ రామచంద్రను, మండల పరిధిలోని అవకలదొడ్డి గ్రామానికి చెందిన గోవిందప్పను జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ తమకు ఈ పదవిని అప్పగించిన అధిష్టానానికి మంత్రి రామచంద్ర రెడ్డి, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కుప్పం మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఏఎస్ విద్యాసాగర్, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వి.పెద్దన్న, జెఎం.కృష్ణమూర్తి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణలు అర్థరహితం

బుచ్చినాయుడు కండ్రిగ: మండల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ మండల నాయకులపై ఆరోపణలు చేయటం అర్థరహితమని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మణినాయుడు, వైస్ ఎంపీపీ బాబురెడ్డి తెలిపారు. బుధవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుచ్చినాయుడు కండ్రిగలో టీడీపీ నాయకులు ఆరోపణలపై నిరసన తెలిపి తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. అజయరెడ్డి, హరిబాబు, చలపతి, మునస్వామి తులసి, దేవదాసురెడ్డి, ఇమామ్‌బాషా, గిరిరెడ్డి, హరిప్రసాద్, వెంకటయ్య, తిరుపాల్,లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కుప్పం: కుప్పం పురపాలక సంఘం పరిధిలో కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం పురపాలకసంఘం పరిధిలోని కమతమూరు ప్రాంతంలో పర్యటించారు. చిత్తూరు జిల్లా ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు సమ్యలను ఎంపి, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై వారు స్పందింస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స.హ చట్టంపై చిత్తశుద్ధి ఏదీ..?

అధికారి మారిన పేరు మార్చరా..!

ప్రజాశక్తి- యాదమరి: అధికారి మారినా.. పేరు మార్చే ఓపిక యాదమరి తహశీల్దార్ కార్యాలయం సిబ్బందికి లేదు.. దీన్నిబట్టే తెలుస్తోంది.. స.హ చట్టంపై వీరికి ఎంత బాధ్యత ఉందో అని.. ఎంత మేరకు ప్రజలకు సమాధానం చేరవేస్తున్నారో అర్థమవుతుంది. తహశీల్దార్ కార్యాలయం ముందు సమాచార హక్కు చట్టం బోర్డులో బదిలీపై వెళ్లిన తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ఇద్దరి పేర్లు మార్చకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు అర్జీదారులు సమాచార హక్కు చట్టానికి దరఖాస్తు చేసుకునే అధికారులు ఎవరని ప్రశ్నార్థకంగా తయారైంది. డిప్యూటీ తహశీల్దార్ మహేష్ బదిలీపై వెళ్లి ఆరు నెలలు గడుస్తోంది. ప్రస్తుతం ఉన్న తహశీల్దారూ.. బదిలీపై వెళ్లి నెల రోజులు గడుస్తోంది. అయినా.. పాత తహశీల్దార్ పేరే బోర్డుపై ఉంది. ప్రస్తుతం యాదమరి తహశీల్దార్‌గా హనుమంతు విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ తహశీల్దార్‌గా జయంతి విధులు నిర్వహిస్తూ పిఐఓగా సమాచార హక్కు చట్టం దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు స.హ చట్టం దరఖాస్తు చేసుకునే ప్రజలు కార్యాలయం ముందు ఉన్న బోర్డును చూసి తికమక పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయం ముందు ఉన్న బోర్డులో అధికారుల పేర్లు మార్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లింపు

రూ.21.36కోట్ల చెక్కులు పంపిణీ

కార్మికులకు చెక్కలను అందజేస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే రైతన్న అభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం రేణిగుంట మండలంలోని గాజులమండ్యంకు సమీపంలో గల శ్రీవెంకటేశ్వర కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ 368 కార్మికుల కుటుంబాలకు చెల్లించవలసిన జీతభత్య బకాయిల 21.36 కోట్ల రూపాయల చెక్కులను మంత్రి రోజా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బాంధువుడు మన ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు తొమ్మిది సంవత్సరాలుగా జీతభత్యాలు పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని సీఎం దష్టికి తీసుకెళ్ళమన్నారు. సీఎం స్పందించి కార్మికులకి రావలసిన బకాయాలను అందజేశారని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు పడుతూ వరుణ దేవుడు కూడా జగనన్న ఆశీర్వదిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో వర్షం లేక రైతులు విలవిలలాడిపోయారని దయ్యాబట్టారు. రాష్ట్ర ప్రజలు బాగుంటే చంద్రబాబు ఓర్వలేడని చమత్కరించారు. మంత్రి రోజా మాట్లాడుతూ విద్యాదీవెన పథకంకి బటన్ నొక్కి కార్యక్రమానికి నగిరికి విచ్చేసిన సీఎంకి వెంకటేశ్వర సహకార చక్ర ఫ్యాక్టరీ లిమిటెడ్ పరిస్థితిని విన్నవించానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి రైతులందరికీ కార్మికులకు మంచి చేస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చినమాట ప్రకారం షుగర్ ఫ్యాక్టరీ 368 కార్మికులకు మొత్తం 21.36 కోట్లను మంజూరు చేశారని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్మోహన్ రెడ్డికి ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ సంఘం థాంక్స్ సీఎం అంటూ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జడ్పిటిసి సంధ్యారాణి, జువ్వల దయాకర్ రెడ్డి, ప్రభాకర్ గాజుల మండ్యం సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, వెంకట రమణారెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, విప్పమాను పట్టెడు సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వజ్రాల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి- పలమనేరు: నకిలీ వజ్రాలతో మోసం చేసే అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బైరెడ్డిపల్లి మండలం చీలలపల్లె గ్రామానికి చెందిన బి.సుబ్రమణ్యం, జంబుగుండ్లపల్లెకు చెందిన సి.సుబ్రమణ్యం మంగళవారం పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద ఓ టీకొట్టుకు వచ్చారు. అప్పటికే ఫోన్లో బేరం కుదుర్చుకున్న సల్మాన్‌ను కలిశారు. వారి వద్దనున్న వజ్రాలను చూపెట్టి వీటి విలువ రూ.కోట్లలో ఉంటుందని నమ్మించారు. బేరసారాలు తర్వాత చేసుకుందాం ఇలాంటివి తమవద్ద చాలా ఉన్నాయని నమ్మబలికారు. ప్రస్తుతానికి బయానాగా రూ.10వేలిస్తే ఆపై బేరం ఉంటుందని చెప్పి అతనికి రెండు వజ్రాలు ఇచ్చారు. పట్టణంలోకి వచ్చిన తర్వాత నగదు చెల్లిస్తానని సల్మాన్ చెప్పారు. స్థానికంగా వజ్రాలను చెక్ చేయిస్తే అవి నకిలీవి అని తేలిడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బందాలుగా విడిపోయి నిందితులకోసం గాలింపుచర్యలు ప్రారంభించారు. నకిలీ వజ్రాలను అమ్మిన ఇద్దరితోపాటు వారి వెనుక ఉన్న ముఠాను స్థానిక ఇండియన్ కాఫీ బార్ వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా కర్ణాటకకు చెందిన రైస్‌పుల్లింగ్ ముఠాగా తేలింది. కొన్నేళ్లుగా నకిలీ వజ్రాలతో పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. పలమనేరు ప్రాంతంలోని కొందరు ఏజెంట్ల ద్వారా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు నిందితులు అంగీకరించారు. వీరితో పాటు పలమనేరు టౌన్ వీధికి చెందిన రఫీ, ఆది ఆంధ్రావీధికి చెందిన గమేస్, పెద్దపంజాణి మండలం ముదరంపల్లెకు చెందిన వెంకట రమణారెడ్డి, కర్ణాటకలోని దొడ్డగాళ్లహాళికి చెందిన శివప్ప, బెంగళూరు ఆడగాడికి చెందిన గోవిందస్వామి, హెచ్.గొల్లపల్లికి చెందిన సతీష్, బంగారుపేట తాలుకా గెస్తేరిహాళికి చెందిన రవితేజను ఆరెస్ట్ చేశారు. ఈ కేసును కేవలం 12 గంటల్లో చేధించిన సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి డీఎస్పీ సుధాకర్ రెడ్డి అభినందించారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ వైయస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట పరిశీలకులు మొగసాల కష్ణమూర్తి, మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.17లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. సర్పంచ్ కొమ్ము వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, మండల మేజిస్ట్రేట్ కుమారస్వామి, ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, హౌసింగ్ ఏఈ స్వామి దాస్, అగ్రికల్చర్ ఏవో గీత పాల్గొన్నారు.

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

సత్యవేడు డిపో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -సత్యవేడు: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సత్యవేడు డిపో నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. జోనల్ కార్యదర్శి సి భాస్కర్, రీజనల్ కార్యదర్శి ఈ.శివకుమార్ ఆధ్వర్యంలో డిపోలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసీలో అనేక పరిణామాలు వస్తున్నాయని, బస్సులు కొనుగోలు సిబ్బంది రిక్రూట్మెంట్ తగ్గిపోతుందని దీని వలన ప్రజారవాణా కూడా తగ్గిపోతుందన్నారు. జీవో నెంబర్ 70, 71 ఉపసంహరింప చేయాలని, తనిఖీ విధానంలో మార్పులు రావాలని అన్నారు. నూతన కమిటీలో సిఐటియు ఇన్‌చార్జి రమేష్, గౌరవాధ్యక్షులుగా ఏ.గంగయ్య, అధ్యక్షులు ఆర్.ఏలుమలై, ఉపాధ్యక్షులుగా వి.శంకరయ్య, జిఆర్.రవి, పిఎం.రత్నం, కార్యదర్శిగా ఆర్. జయకుమార్, సహాయ కార్యదర్శిగా సి.చంద్ర, సికెసి.మౌలి, కె.వెంకటయ్య, టి.క్రిష్ణ, ప్రచారకార్యదర్శిగా బికె.రామయ్య, కోశాధికారిగా పివి.రత్నం, కమిటీ సభ్యులుగా పి.ఝాన్సీ, కెపి.రెడ్డప్ప, బిసి శేఖర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం డిపో మేనేజర్‌ను కలిసి డిపో సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కుప్పంలో ఆగిన సాయినగర్ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి- కుప్పం: చెన్నై నుంచి షిరిడి వెళ్లే సాయినగర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం కుప్పంలో ఆగింది. ఈసందర్భంగా చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, కుప్పం పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ సుధీర్, సాయి మాతాసేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో రైలును ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ సాయిమాత సేవ ట్రస్ట్ అధ్యక్షులు జగదీష్ బాబు కృషితోనే సాయి ఎక్స్‌ప్రెస్ కుప్పంలో నిలుపుదల చేయడానికి రైల్వేఅధికారులు సమతించడం జరిగిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ రైలు కుప్పంలో ఆపడానికి ఆయన కృషి చేశారని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఏర్పాటు

నాయుడుపేట: ఎస్ఎఫ్ఐ విస్తతస్థాయి సమావేశం రెండోరోజు నాయుడుపేటలోని సుందర రామిరెడ్డి భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కౌశిక్, బబ్లు, ఉపాధ్యక్షులుగా నాని, నవదీష్, దీపక్, గిరి, సహాయ కార్యదర్శులుగా అబ్బాస్, షముల్ల కమిటీ సభ్యులుగా దయాకర్, జస్వంత్ నౌషద్, నవీన్, విష్ణు, యశ్వంత్, కిషోర్‌లతో పాటు మరో 15 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్ తెలిపారు. మాధవ్ మాట్లాడుతూ నూతన ఎస్ఎఫ్ఐ కమిటీ నాయుడుపేట పరిసర ప్రాంతాల్లోని విద్యార్థుల సమస్యలపైపోరాడాలని సూచించారు.

చెరకు రైతులకు తీపికబురు

చెరకు క్రషింగ్‌కు ఎస్ఎన్‌జే షుగర్స్ గ్రీన్‌సిగ్నల్

నగరి: నగరి, పిచ్చాటూరు పరిసర పాంతాల్లోని చెరకు రైతుల అభ్యర్థనను దష్టిలో ఉంచుకుని వారికి నెలవాయి ఎస్ఎన్‌జే సుగర్స్ అండ్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ క్రషింగ్‌కు 2023-24 ఏడాదికి గాను అనుమతిని ఇస్తున్నట్లు కంపెనీ ఏజీఎం వరదరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరకు పంటను రైతు వారీగా అగ్రిమెంటు చేయించుకుని ఒక క్రమ పద్ధతిలో క్రషింగుకు తీసుకొనుటకు కంపెనీ యాజమాన్యం నిర్ణయించిందన్నారు. నగరి, పిచ్చాటూరు ప్రాంతంలోని చెరకు పరిశ్రమ మూతపడిన కారణంగా తిరిగి ప్రారంభించే వరకు ఆ ప్రాంత చెరకు రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న సంవత్సరాల్లో వారి చెరకును అగ్రిమెంట్లు చేసుకొని జోన్ రైతులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నగరి, పిచ్చాటూరు ప్రాంతాల్లోని చెరకు రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల వారీగా అందుబాటులో ఉన్న ఎస్ఎన్‌జే సిబ్బందిని కలిసి సెప్టెంబర్ 15వ తారీకు లోపల వారి చెరకు పంటను అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు నగరి ఏరియా ఏవో ఆర్.రవిచంద్రన్‌ను 70935 26370 నెంబరుకు పిచ్చాటూరు ఏవో సురేంద్ర నాయుడును 81795 90770 నెంబరుకు, ఫిర్యాదుల నిమిత్తం కేన్ ఏజీఎం కె.వరదరాజన్‌ను 90639 63579 నంబరుకు సంప్రదించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎమ్మెల్యే

యాదమరి: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. మాదిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో తాళ్లమడుగు గ్రామంలో ప్రతి గడపనూ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయపరిధిలోని వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన వారికి అందించాలన్నారు. గ్రామస్తులు పెన్షన్, జగనన్న ఇల్లు కావాలని ఎమ్మెల్యే దష్టి తీసుకెళ్లారు. గ్రామంలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ బి.ధనంజయరెడ్డి, సర్పంచులు బాలకష్ణారెడ్డి, మీనా మనోజ్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, జెకె రవి, తహశీల్దార్ హనుమంతు, మండల అభివద్ధి అధికారి శివరాజ్, ఎస్పై సుమన్, ఎంఈఓ రుక్మిణి, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీఓ కవిత పాల్గొన్నారు.

అన్నదానంకు కూరగాయలు వితరణ

శాంతిపురం: టీటీడీలో నిత్య కైంకర్యమైన అన్నదాన సేవా కార్యక్రమానికి మండల జిల్లా పరిషత్ సభ్యులు ఎస్.శ్రీనివాసులు, ఆయన సహచర బందం బుధవారం సుమారు 9 టన్నులను, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవాలయానికి రెండున్నర టన్నుల కూరగాయలు వితరణగా అందించారు. లోకనాథ్ రెడ్డి, నర్సరీ బాబు, సంతూర్ రవి, మంజునాథరెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రమేష్‌రెడ్డిల సహాయ సహకారాలతో అన్నదానంకు కూరగాయలు అందించినట్లు శ్రీనివాసులు తెలిపారు.

పనిచేయని కంప్యూటర్లు
గంటల తరబడి పడిగాపులు
పట్టించుకోని అధికారులు

ఆధార్ అగచాట్లు..

ఆధార్ కార్డు అనుసంధానం కోసం పడిగాపులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవడం కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మీసేవ, సచివాలయాల్లోని కంప్యూటర్లు, సర్వర్లు పనిచేయకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు పడాల్సి వస్తుంది. జగనన్న చేయూత పథకంలో ప్రభుత్వం 45 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.18,750లు చొప్పున నాలుగు విడతల్లో రూ.75వేలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తుంది. ఇప్పటికే రెండు విడతల డబ్బులు లబ్ధిదారులు ఖాతాల్లో పడ్డాయి. మూడోవిడత చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కులం, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా నెంబరుతో పాటు ఆధార్ హిస్టరీ అడుగుతున్నారు. లబ్ధిదారులు మీసేవ సెంటర్‌కు వెళ్లి ఆధార్ హిస్టరీ చేయించుకోవాల్సి ఉంది. అయితే ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం అయితేనే ఆధార్ హిస్టరీ వస్తుందని మీసేవా కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎస్‌బిఐలో ఆధార్ సెంటర్లు ఉండేవి. ఈఆధార్ కేంద్రాలు తీసేసి పోస్ట్ ఆఫీస్, సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు తెరిచారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని రెండు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులకే సచివాలయాల్లోని ఆధార్ కేంద్రంలో కంప్యూటర్లు సరిగ్గా పనిచేయకుండా పోయాయి. దీనికి తోడు సర్వర్ కూడా పనిచేయకుండా మోరాయించడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పడిగాపులు పడినా ఆధార్‌కి ఫోన్ నెంబర్ అనుసంధానం ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు సైతం ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను కోల్పోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పోస్టాఫీసులు, సచివాలయల్లో పనిచేసే కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో పాటు సర్వర్ల సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE :: CHITTOOR
I.A.No. 258 of 2022
A.S.No.104 of 2019
T.Nageswara Rao .....Petitioner
Vs
Smt.T.Venkatarathnamma & others \ ...Respondents
NOTICE TO THE RESPONDENTS 13,15 & 17
13. Kesavan,S/o Not Known, aged about 75 years,Hindu,Cultivation, residents of D.No.6-48/8, S.K.D. Nagar, M.R.Palle Post, Tirupati
15. Hema,D/o Kesavan, aged about 48 years, Hindu,
17. Jayalakshmi, D/o Kesavan, aged about 40 years, Hindu,
No.15 and 17 are residents of Opp.Water Tank,Balaji Colony, Tirupati
Sir, Take notice that the above I.A is posted for your appearance to **22-09-2023** before the Hon'ble District Judge, Chittoor. Please appear before the above said court on **22-09-2023 at 10-30 A.M** either in person or through an advocate and file your objections if any. Otherwise the matter will be decided ex-parte.
Sd/- **K.P. KUMARASWAMY**
Advocate for the Petitioner

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక సంతపేట నాగాలమ్మ గుడి సమీపంలోని బృందావనం ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడకల్లో పాఠశాల కరెస్పాండెంట్ శైలజకుమారి ప్రత్యక్షంగా పాల్గొనివిద్యార్థులు, ఉపాధ్యాయు బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

హార్వార్డ్ ఇంగ్లీస్ మీడియం పాఠశాల...

గీతా సారం ప్రపంచానికి ఆదర్శమని కృష్ణుడు పుట్టిన రోజున కృష్ణాష్టమి జరుపుకుంటున్నట్లు హార్వార్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ భాస్కర్ అన్నారు. స్థానిక రామ్‌నగర్ కాలనీ, శ్రీకృష్ణదేవరాయల వీధిలోని హార్వార్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

దేవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో...

స్థానిక దేవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకులు నిర్వహించారు. కరెస్పాండెంట్ ప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయులను కృష్ణాష్టమి రోజను సన్మానించి జ్ఞాపికలు ప్రధానం చేశారు.

వికోట: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొని పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నారాయణ విద్యాసంస్థలలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు.

సోమల: మండల కేంద్రమైన రామసముద్రం గ్రామంలోని బ్రహ్మకుమారి గీతఅక్క ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఓం శాంతి భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పై చంద్రశేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకష్ణ, వాలేశ్వరస్వామి ఆలయ అర్చకులు మణికంఠ హాజరయ్యారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని వికాస్ విద్యాసంస్థలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లమాల సుధాకర్, డైరెక్టర్ వసుద తెలిపారు. డైరెక్టర్స్ కులజీవన్, శ్రీకాంత్, శషార్, గణేష్, రాము, ప్రిన్సిపాల్ మనోహర్, సురేష్ పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: స్థానిక శ్రీనివాసపురంలోని ఎస్సార్ ప్రైమ్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల జిఎం.రమేష్, వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, శ్రీకాంత్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏర్పేడు: ఓం నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ చింతామోహన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.
I.A.No. 1401/ 2019
O.S.No. 1149/ 2019
Billa Penchalaiah, S/o Late B.Narasaiah, aged about 48 years, Hindu, Business, resident of D/No.5/438-A, Yeguvagadda, beside GMC Bank, Rajampet Town, erst while Kadapa District, Presently Annamayya District.
...Petitioner/Plaintiff
Vs
Billa Swetha, D/o Late B.Lakshmi Narasaiah, aged about 31 years, Hindu, doctor, resident of C/o. Ch.Radhaiah, D.No.19/3/20, Padmavathi Apartment, 1st Floor, Kakathiya Nagar, Beside, Srinivasa Kalyana Mandapam, Tirupati- 517501.
...Respondent No.3/Defendant No.3.
NOTICE TO RESPONDENT NO.3/ DEFENDANT NO.3
పై తెలిపిన I.A.No.1401/2019 నందు రెస్పాండెంట్ నెం.3 అయిన మీరు హాజరు అగుటకు గాను 27.09.2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున 27.09.2023వ తేదీన ఉదయం 10.30గంటలకు పై తెలిపిన రాజశ్రీ కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోనవలెయును. లేనంతట మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.
//By the Order of the Hon'ble Court//
T.SUBRAMANYAM
Advocate, KADAPA.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.
O.S.No. 1149/ 2019
Billa Penchalaiah, S/o Late B.Narasaiah, aged about 48 years, Hindu, Business, resident of D/No.5/438-A, Yeguvagadda, beside GMC Bank, Rajampet Town, erst while Kadapa District, Presently Annamayya District.
...Plaintiff
Vs
Billa Swetha, D/o Late B.Lakshmi Narasaiah, aged about 31 years, Hindu, doctor, resident of C/o. Ch.Radhaiah, D.No.19/3/20, Padmavathi Apartment, 1st Floor, Kakathiya Nagar, Beside, Srinivasa Kalyana Mandapam, Tirupati- 517501.
...Defendant No.3.
SUMMONS TO DEFENDANT NO.3
పై తెల్పిన వాది ప్రతివాది అయిన మీపైన మరియు ఇతరుల పైన భాగపరిష్కారం కొరకు పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా లో మీరు హాజరు అగుటకుగాను వాయిదాను 27.09.2023వ తేదీకి వేసియున్నారు. కావున 27.09.2023వ తేదీన ఉదయం 10.30గంటలకు పై తెలిపిన రాజశ్రీ కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోనవలెయును. లేనంతట మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.
//By the Order of the Hon'ble Court//
T.SUBRAMANYAM
Advocate, KADAPA.